# ఆనాటి చెలిమి ఒక కల!

-యం. ఆర్. అరుణకుమారి

"సంధ్యా! నిజంగా నువ్వు ఎప్పుడూ పశ్చాత్తాపపడ లేదా?"

"పశ్చాత్తాపమా? ఎందుకూ?"

నా ప్రశ్నలోని కుతూహలమే... ఆమె ప్రశ్నలో కూడా.. గోడకక్కొట్టిన బంతిలా సూటిగా వచ్చి.. అహ నికి తగిలి.. తడబడ్డాను.

"అంటే... అదే... నువ్వు... శ్యాం... మతాంతర... పె..ళ్ళి.." మాటలు నంగి నంగిగా.. చూపులు.. అప్పు డే వచ్చిన శ్యాం వేపు బిత్తరగా...! నేననుకొన్నట్లే.. శ్యాం మొహంలో నవ్వు బదులు.. గాంభీర్యం.. కళ్ళల్లో ఆసక్తి నిండి.. సంధ్యవేపు ఆతృతగా.. చూపు నిలిపింది.

"అదా!" తేలిగ్గా చూసింది సంధ్య. తుంచిన ఇడ్లీ ముక్క నోట్లో పెట్టుకోబోయి ఆగి చటుక్కున శ్యాం నోట్లో కుక్కింది. "ఇది పెట్టకపోతే ఈగలు వెళ్ళేవి.. తెరిచిన నోట్లోకి. మింగూ..." చిలిపిగా అంటున్న సంధ్య వేపు చిరుకోపంగా చూస్తూ ఏదో అనబోయి పొలమార్చుకున్నాడు శ్యాం. సంధ్య చటుక్కున లేచి ఓ చేత్తో నీళ్ళ గ్లాసు తీసి తాగిస్తూ మరో చేత్తో తల, వెన్ను నిమురుతూ ఆరాటంగా!

"ఏయ్! నాకేం కాలేదు గానీ.. ముందు టిఫిన్ తిను. ఆc! అన్నట్లు... వంశీ ప్రశ్నకు జవాబు చెప్ప లేదే?" శ్యాం నవ్వుతున్నాడు.

"ఉc!" సంధ్య కూడా నవ్వింది సన్నగా. "టిఫిన్ తిననా? జవాబు చెప్పనా?"

"ఆహాc! ధర్మసందేహమే! ముందు తిను" శ్యాం నా వేపు చూశాడు. "ఎంత చెప్పినా బ్రేక్‌ఫాస్ట్ తీసు కోదు. ఇవాళేంటో.. నువ్వున్నావని.. కూచుంది గానీ..!"

"ఏం? డైటింగా?" నవ్వాను. చెక్కుచెదరని ఆమె ఫిజిక్స్... చూడగానే నాకు ఆశ్చర్యం కల్గించిన మాట మాత్రం నిజం. ఇరవై ఏళ్ళకు ముందు ఎలా ఉందో.. అదే అందం.. అదే నాజూకు! కాకపోతే.. చెంపల దగ్గర.. ఒకటో రెండో.. తెల్ల వెంట్రుకలు.. అంతే!

"అదేం లేదు. అయినా ప్రత్యేకంగా నేను వడ్డిం చుకు తిననన్నమాటేగానీ.. ఇతగాడు.. తింటూ, తిం టూ.. సగం నాకే తినిపించేస్తాడు. తినకపోతే.. మళ్ళీ.. అలకలూ...!" శ్యాం చేతిని పట్టుకొని నోటి దగ్గరకు లాక్కుని.. చేతిలోని ఇడ్లీ ముక్క తీసుకుంటూ "తన చేత్తో.. నే తినకపోతే.. తనకు తిన్నట్లుగా ఉండదట మరి?"

"శ్యాం అలుగుతాడా?" నమ్మలేకపోయాను. శ్యాంకసలు కోపమే రాదు. ఎదుటివారి మనసును, బాధను అర్థం చేసుకుని తదనుగుణంగా నడుచుకొనే అజాతశత్రువతను.

"ఆహా! భయంకరంగా!" గలగలా నవ్వింది సంధ్య. "నా దగ్గరేలే! అయినా.. మీ మగాళ్ళ బుద్ధి అంతేనని చలం చెప్పనే చెప్పాడు కదా! మగాళ్ళు ఇంట్లోకి రాగానే కోటు, తలగుడ్డా తీసి వంకీకి తగిలించినట్లు.. మంచి, మర్యాద కూడా తగిలిం చేసే.. లోపలికి.. పెళ్ళాల దగ్గరకొస్తారనీ! ఐనా... మీ అసలు రూపం పెళ్ళాల దగ్గరే కదా చూపేది."

"ఇంకెవరి దగ్గరన్నా చూపిస్తే.. మీరూరు కుంటారా ఏమిటి?" శ్యాం కొంటెగా కన్నుగీటాడు.

నేనేం చూడనట్లు తలవంచుకొన్నా.. సంధ్య మొహం సిగ్గుతో కందిపోవటం, కోపంగా శ్యాం తొడ గిల్లటం తెలుస్తూనే ఉంది.

"అబ్బా!" శ్యాం తొడ తడుముకొన్నాడు.

"అబ్బా!" సంధ్య వెక్కిరింతగా "మొగుళ్ళ.. అన్నిరకాల టెన్షన్స్, ఎక్స్‌ప్రెషన్స్... ఎగ్జిట్... పెళ్ళాలే గానీ.. తినవయ్యా! ఆఫీసుకు టైమవుతోంది."

"ఆఫీసా?" చిన్నపిల్లాడిలా శ్యాం మొహం చిట్లించాడు.

"ఏం... వెళ్ళవా?"

"వంశీ..."

"ఎక్కడకూ వెళ్ళద్దే! తమరికి వీడియో కాన్ఫరెన్స్ ఉందివాళ. దయచేయక తప్పదు. అదిగో.. పిలుపు"

మోగుతున్న సెల్ చెవి దగ్గర పెట్టుకుంటూ లేచి వాష్‌బేసిన్ వేపు నడిచాడు శ్యాం. "ఇదిగో.. బయ ల్దేరుతున్నా" అంటూ ఏవో ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తున్నాడు.

సంధ్య చప్పున లేచి వెళ్ళి.. టాప్ తిప్పి.. అతను చెయ్యి కడుక్కోగానే నాప్‌కిన్ అందించబోయింది. అతనదేం గమనించనట్లుగా ఆమె పయిట చెరుగుతో

చెయ్యి, పెదవులు తుడుచుకొంటుంటే వారింపుగా చూసింది, నేనున్నానని కాబోలు.

"నాప్‌కిన్ అలవాటే లేదు దొరగారికి... ఎవరున్నా.." గొణిగింది.

"ఈ అలవాటూ... దొర్సానిగారు నేర్పిందేలే!" నవ్వేశాడు శ్యాం. "సారీ వంశీ! కాన్ఫరెన్స్ అవంగానే వచ్చేస్తా"

"ఆహఁ! రెవ్యూ కూడా! తొందరేం లేదు" సంధ్య నవ్వుతూ టీ కప్పు అందిస్తే.. అందుకోకుండానే రెండు సిప్‌లు చేశాడు. మిగిలింది సంధ్య తాగటం ఆశ్చర్యం.

"సర్లేవమ్మా! ఇంటికి త్వరగా రానని.. సెటైర్లు! ఉద్యోగమలాంటిది. ఏం చెయ్యను? వస్తాను వంశీ! సంధ్యా..."

అతన్తోబాటు గుమ్మందాకా వచ్చాను. శ్యాంను చూసి డ్రైవరు కారు స్టార్ట్ చేశాడు. అటెండర్ తలుపు తీసి పట్టుకున్నాడు.

"ఆఁ! వస్తున్నా" సంధ్య బ్రీఫ్‌కేస్ అటెండర్ చేతికిచ్చింది.

"మీరు లంచ్ చేసెయ్యండి. నా కోసం వెయిట్ చెయ్యొద్దు. వస్తానూ!" చెయ్యి వూపుతూ... మాటలు నాకే... చూపులు మాత్రం సంధ్య పైనే!

"రాత్రంతా ప్రయాణం కదా! రెస్ట్ తీసుకో వంశీ! ఈలోపు నేను వంట చేసేస్తాను."

"వంట నువ్వు చేస్తావా?"

శ్యాం గెజిటెడ్ ఆఫీసరు. పని మనుషులు ఉన్నారు.

"ఏం.. వంట నేను చెయ్యకూడదా? నేను.. వంట.. బాగానే..." ఆగి నవ్వింది ఏదో తట్టినట్లు. "పనివాళ్ళున్నా.. శ్యాంకు వండి, వడ్డించటం, అతని పన్లన్నీ నేనే చెయ్యటం.. నాకిష్టం. అయినా.. అసలు పనేమీ చెయ్యకుండా ఎలా ఉండను? ఇన్నేళ్ళూ కష్టపడింది చాల్లే. ఇప్పుడైనా.. హాయిగా ఉండు అంటాడు. నాకైనా పొద్దుపోవాలి కదా! బోలెడు పుస్తకాలు కొంటాడు. చదవమంటాడు. రాసుకోమంటాడు."

"ఇప్పుడూ.. రాస్తున్నావా?" సంధ్య మంచి కవయిత్రి. చక్కటి కవితలు రాసేది కాలేజీ రోజుల్లో.

"ఆఁ! శ్యాం రాసినవి ఫెయిర్ చెయ్యటం, పత్రికలకు పంపటం.. నా పనే!" నవ్వింది సంధ్య.

"అవునా! ఈ మధ్య ఎక్కువ జర్నల్స్ చూడ్డంలేదు. శ్యాం పేరు గమనించలేదు"

"శ్యాం.. తన పేరు, నా పేరు కలిపి... 'శ్యాంధ్య' అని పెట్టాడ్లే!"

"ఆఁ! ఆఁ! చూశాను. పేరేంటి.. కొత్తగా ఉందే.. అనుకొన్నా కూడా. మీ పేరని తెలీదు. సో.. జంటగా రాస్తున్నారన్నమాట. 'బీనాదేవి' 'వసుంధర'ల్లాగా!" నిజంగానే ఆశ్చర్యపోయాను.

సంధ్య మొహంలో సంతోషం, సంతృప్తి చూస్తుంటే ముచ్చటగా ఉంది. ఎంతమంది జంటలకు అభిరుచులు కలుస్తాయి? కలబోసుకొని సాగుతారు? 'శ్రీరమణ' 'మిథునం' కథలో జంటలా ఉండాలి.. దాంపత్యం" సంధ్య ఎప్పుడో అన్న మాటలు గుర్తొచ్చాయి. ఆ కథను నా చేత బలవంతంగా చదివించటమూ గుర్తొచ్చింది.

"ఎందుకలా పడి చస్తావు ఈ కథంటే. ఏముందీ కథలో... అప్పదాసు, బుచ్చిలక్ష్మిల పోట్లాట తప్ప!" అని నేనంటే... కొట్టినంత పని చేసింది.

"నీకు పోట్లాటగా అన్పించిందా? దాని వెనుక.. వారిద్దరి ప్రేమ, అనురాగం, అన్యోన్యత, ఆత్మీయత కన్పించలేదా?" బోలెడు ఆశ్చర్యపోయింది కూడా.

"సో.. నీకిష్టమైన 'మిథునం'లా.. జీవితం! పశ్చాత్తాపమే లేదస్సలు!" హఠాత్తుగా అనేశాను.

అవునన్నట్లుగా.. ఫోన్ రింగ్! సంధ్య వెళ్ళి రిసీవర్ తీసింది.

"అబ్బా! వంశీ... మనింటికి రావటం కొత్తగానీ.. వంశీ మనకు కొత్త కాదు గదా! ఏం ఫర్వాలేదు. తనేమీ అనుకోడులే! సర్లే! నువ్వే మాట్లాడు" రిసీవర్ నాకిచ్చింది.

"వంశీ!" శ్యాం సెల్‌లో నుండి మాట్లాడుతున్నాడు చిన్నగా.. ఇంగ్లీషులో "నీకు తెలుసు కదా! సంధ్య పైకలా.. కేర్‌నాట్‌గా ఉన్నట్లు కన్పిస్తుందే గానీ.. చాలా సెన్సిటివ్. గతాన్ని గుర్తుతెచ్చుకొని అప్‌సెట్ అవుతుందేమో పైగా.. తన ఆరోగ్యం కూడా ఈ మధ్య సరిగా

---

## పూవులు

నిరంతరం
వెలిగేందుకే
రాలుతుంటాయి
ప్రసన్నవదనంగా
అలరారేట్లు
చేస్తాయి.

–జి. శ్రీశైలం

---

ఉండటం లేదు. ప్లీజ్! నువ్వు రెస్ట్ తీసుకో! నేనొచ్చాక మాట్లాడుకొందాం. ఓ.కే!" అతని ప్రతి మాటా.. సంధ్య పైన ఉన్న ప్రేమను ప్రతిఫలిస్తోంది.

"ఓ.కె." నిట్టూర్పు నాపుకొంటూ ఫోన్ క్రెడిల్ చేశాను. "నేను కాసేపు పడుకొంటాను సంధ్యా! టిఫిన్ ఫుల్‌గా పట్టించావు కదా! మత్తుగా ఉంది" సన్నగా నవ్వాను నాకిచ్చిన గదివేపు నడుస్తూ.

సంధ్య ఏదో అనబోయి.. ఆగి చెప్పింది. "సర్లే! పడుకో!"

❖ ❖ ❖

"వంశీ! వంశీ!" శ్యాం తట్టి లేపుతుంటే బల వంతంగా కళ్ళు తెరిచాను.

"లే! లే! మూడైంది టైం. ఇంకా.. భోం చెయ్యలేదట!"

"ఉఁ! బాగా నిద్ర పట్టేసింది"

లేచి మొహం కడుక్కొని.. డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళేసరికి సంధ్య వడ్డిస్తోంది ప్లేట్లలో. ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి ఏదో చెబుతున్న శ్యాం.. నా పొడి దగ్గు విని చెయ్యి తీసి ఒళ్ళో పెట్టుకున్నాడు బుద్ధిగా.

"చెప్పు వంశీ! ఎంత మంది పిల్లలు? పాపలా! బాబులా! ఇద్దరూనా? ఏం చదువుతున్నారు?" మాటల మధ్యలో అడిగింది సంధ్య భోంచేస్తూ.

"ఏంటీ.. ఇవాళ కూరలేం బాగాలేవు. వంటెవరు చేశారు? నువ్వు వంశీతో మాట్లాడ్తూ వుండిపోయావా?" శ్యాం మొహం కాస్త చిట్లించి.. తన ప్లేట్లోని వేపుళ్ళు, కూరలు కొంచెం కొంచెం తీసి సంధ్య ప్లేట్లో వేస్తున్నాడు.

శ్యాం మాటలకు మనసు చివుక్కు మంది. నిజానికి వంట చాలా బావుంది.

"ఆఁ! నువ్వలా వెళ్ళటం ఆలస్యం.. కుంభకర్ణుడిలా పడి నిద్రపోయాడు. ఇదిగో.. ఇప్పుడు నువ్వొచ్చి లేపటమే! ఆకల్లేకపోతే వంట బాగా లేదనే వంకలు మామూలేగా! చెప్పు వంశీ.. నీ పిల్లలు..."

"సంధ్యా! ఇవాళ స్పెషల్స్ ఏం చెయ్యలేదా? స్వీట్సన్నా తెప్పించకపోయావా?"

సంధ్య సీరియస్‌గా చూడ్డంతో శ్యాం తడబడ్డాడు. "వంశీ వచ్చాడని..."

"ఉఁ! వంశీ సాకుతో తిందామనే! వంట్లో ఉన్న స్వీటు చాల్లేబ్బా!"

"ఏంటీ శ్యాంకు షుగరా?"

"ఆహాఁ! నిక్షేపంగా! షుగర్ కాస్త తక్కువైతే టీ రుచే లేదని అరిచే రోజులు పోయి.. కషాయంలా తాగాల్సిన రోజులు మరి!" చిలిపిగా అంది సంధ్య.

"ఆ! ఆ కషాయాన్ని అమృతంలా సేవించేదెవరో మరి!" శ్యాం కొంటె జవాబు.

పొద్దున శ్యాం తాగిన టీ తాగటం, ఇప్పుడు ఎంగిలి చేత్తోనే తన ప్లేట్లోని వంటకాలు వేస్తే తింటూండటం గుర్తొచ్చింది నాకు. వెంటనే అడిగాను.

"సంధ్యా! నువ్వసలు ఎంగిలి అంటేనే అసహ్యపడేదానవు కదా?"

శ్యాం ప్లేట్లోంచి గోంగూర తీసుకొంటున్న సంధ్య ఒక్క క్షణం తెల్లబోయినా నవ్వేసింది.

"అబ్బా! భార్యా భర్తల మధ్య ఎంగిలి..."

"కూడా నాకు నచ్చదు. సినిమాల్లో.. కథల్లో.. ఫస్ట్ నైట్ మొగుడు ఎంగిలి చేసిన పాలు, స్వీట్లు.. మహా ప్రసాదంలా ఎలా తీసుకుంటారో.. ఈ పెళ్ళాలు... అని బోల్డు చిరాకు పడిపోయేదానవు" గుర్తుచేశాను.. అమాయకంగా చూస్తూ.

"అబ్బబ్బా!" తల పట్టుకుంది సంధ్య. "ఆ రోజులు వేరులే వంశీ!"

"ఆ వేర్ల నుండి వచ్చిన ఈ చెట్టు వేరులే వంశీ!" శ్యాం నవ్వుతుంటే ఉడుక్కొంది.

"ఏయ్! చంపేస్తా నిన్ను! నీ వల్లనే... నాకలవాటయ్యింది. అధరామృతం.. అధరామృతమంటూ.." చప్పున నాలుక్కరుచుకొంది సంధ్య మేమిద్దరం గట్టిగా నవ్వేసరికి. తనూ సిగ్గుగా నవ్వేస్తూ "ఉఁ! చూడు. మీ పిల్లల గురించి విననిస్తాడేమో!" చిరుకోపంగా చూసింది శ్యాంవేపు.

"అబ్బా! ఇంటికెవరొచ్చినా పిల్లల గొడవే! ఆ పెరుగిలా.."

"నువ్వు కాస్సేపు నోర్మూస్తావా?" సంధ్య గద్దింపుకు శ్యాం లేచాడు ఎడంచేతిని నోటిపై పెట్టుకొని.

"అదేంటి? పెరుగన్నం తినవా?"

"నువ్వు నోరు మూసుకోమంటే ఎలా తినను? అందుకే లేచేస్తున్నా." చెయ్యి అడ్డుతీయకనే చిన్నపిల్లాడిలా జవాబిచ్చాడు శ్యాం.

"చాల్లే నకరాలు!" శ్యాం చెయ్యి లాగి కూర్చోబెట్టింది. "పెరుగు తినకపోతే... తమరసలే వేడి.. ఇంకా వేడి.."

"చల్లార్చటానికి నువ్వున్నావ్!" గుసగుసగా అంటుం

టే నెత్తిన చిన్నగా మొట్టింది "ఏంటీ... చిన్నపిల్లాడిలా!" అంటూ.

"అదే.. నేనూ అడుగుతున్నా! నెత్తి మీదకు నలభై ఐదేళ్ళొచ్చాయి. గెజిటెడ్ ఆఫీసర్ని. చిన్నపిల్లాడిలా ఇలా కొట్టటమేంటి? బాపు కార్టూన్లలో బొడిపెలు.. ఉత్తుత్తివి కావు వంశీ.. చూస్తున్నావుగా?" శ్యాం ముద్దుమాటలు, బుంగమూతీ చూస్తే నవ్వాగలేదు.

భోంచేశాక హాల్లో కూర్చున్నాం. సంధ్య పనిమనిషికి ఏదో పురమాయిస్తూ కిచెన్లో ఉంది.

"సంధ్య నన్ను పెళ్ళి చేసుకున్నందుకు పశ్చాత్తాప పడిందో లేదో తెలీదుగానీ.. చాలా.. చాలా కష్టపడింది వంశీ! నీకు తెలుసుకదా.. మాది పెద్ద ఫ్యామిలీ! ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు. నాన్నకొచ్చే జీతం ఏమూలకి? ఇంట్లో అందరూ నా మీద ఆశతో ఉన్నారా... ఉద్యోగం, సద్యోగం లేకుండానే.. హఠాత్తుగా నేను సంధ్యను పెళ్ళి చేసుకొనేసరికి... ఇంట్లో తీవ్ర నిరసన. సాధింపులు, వేధింపులు.. ఎంత నరకం అనుభవించామో! మా అమ్మ, చెల్లెళ్ళు కూడా తనతో మాట్లాడేవారు కాదు. అయినా నా కన్నా తనే ధైర్యంగా ఉండేది. నాకూ ధైర్యం చెప్పేది. ఇద్దరం ప్రైవేట్ కంపెనీల్లో చేరాం. బాధ్యతలు తీరేదాకా పిల్లలొద్దనుకొన్నాం. ఎంత కష్టపడ్డామో! అయినా.. చాలా ఓపికగా నా చేత గ్రూప్సు రాయించింది. రాత్రంతా మేల్కొని నా చేత బలవంతంగా చదివించేది. నాకు గవర్నమెంట్ జాబ్ వచ్చాక కూడా తను కొన్నేళ్ళు జాబ్ చేస్తూనే ఉంది. తమ్ముళ్ళకు ఉద్యోగాలొచ్చాకే.. తన చేత ఉద్యోగం మాన్పించాను. అందరి చదువులు, పెళ్ళిళ్ళు అయ్యేదాకా.. అంతా కలిసే ఉన్నాం. అమ్మా నాన్న పల్లెకెళ్ళిపోయారు. సంధ్య ఇక్కడే ఉండమంటుంది గానీ.. వాళ్ళకే మొహం చెల్లదు."

"మరి.. పిల్లలు...?"

"హుం!" నిట్టూర్చాడు శ్యాం. "మొదట్లో వద్దనుకొన్నాం. అయినా ఓసారి నా పొరపాటు వల్ల కన్సీవ్ అయింది గానీ.. అబార్షన్ చేయించుకొంది. అప్పుడేదో ఇన్‌ఫెక్షన్. ఆర్థిక ఇబ్బందులు. సరిగా వైద్యం చేయించలేదు. ట్యూబులు పాడయ్యాయట. ఇప్పుడు ఎంత డబ్బు.. వైద్యం చేయించినా.. ఫలితం లేదు. మాకు పిల్లల్లేరు" శ్యాం గొంతులో విషాదం. "సంధ్య కంట నీరు నేను ఎప్పుడూ చూళ్ళేదు. అబార్షన్ రోజు మాత్రం చిన్న పిల్లలా వెక్కి వెక్కి ఏడ్చింది..." శ్యాం గొంతు

## ఆకాశంలో సగం..

ఆకాశంలో సగం మేము  
నీ మేనిలో అర్ధ నేను  
పైసకు నువ్వటు బొరుసువి  
నేనిటు బొమ్మని!  
నీ బాల్యంలో అమ్మని  
యవ్వనంలో దానమ్మని  
హాస్యలాడటం నీకు ఆట  
"పరిహాసం" మాకు వాటా  
సుఖాల్లో మాకు లేదు భాగం  
దుఃఖాల్లో మాదే పూర్ణభాగ్యం  
ఆనందంలో మా పాత్ర లేదు  
విషాదంలో మాదే ఏకపాత్రాభినయం  
లేమిలో మేమే అండ  
కలిమిలో నీది వేరే ఎజెండా  
భోజ్యేషు మాతలం  
మాకు లేదు సమతులాహారం  
మహారాణులం మేము  
వంటిల్లే మా అధికార నివాసం!  
మా పుట్టుకపై పెదవి విరిచి  
మా నడకల నడ్డి విరిచారు  
మా నడతలకు మడత పేచీలు  
మా నవ్వులకు ఇనుప సంకెళ్ళు  
ఎదపై కుంపటినార్పే  
ఫైర్ ఇంజన్ కొరకు వెదుకులాట  
ఓ అయ్య చేతిలో పెట్టి  
చేతులు దులిపేసుకున్నారు  
మారింది చేతులే  
రాతలు కాదు  
సహజంగానే ఇంజన్  
ఎప్పుడూ ఫైరింగే  
మాటల ఈటెలతో  
నా మనస్సును గుచ్చి  
బెల్టుల మోతలతో  
నా మేనిని చీల్చి  
మగ మృగం విర్ర వీగుతుంటే  
నా సహనాన్ని సమాజం సవాల్ చేస్తుంటే  
రాజ్యం నా వాటాను భోజ్యం చేస్తుంటే  
క్షమయా ధరిత్రినా...  
... కాదు  
శంఖం ధరిస్తాను  
సమానత్వం సాధిస్తాను.

—అల్లం సుధాకర్

జీరపోయింది.

పొరపాట్లు, లోటుపాట్లు అన్నీ నావల్లే. లోలోపల ఎంత బాధపడ్తుందో గానీ.. పైకేమీ వ్యక్తపర్చదు. చాలా గొప్ప వ్యక్తిత్వం.."

ఇందాక సంధ్య నా పిల్లల గురించి అడిగినప్పుడల్లా శ్యాం మాట మార్చటం గుర్తొచ్చింది.

"సారీ!" మనస్ఫూర్తిగా చెప్పాను. "పిల్లల్లేక పోవడం..."

"వల్ల బెంగేమీ లేదు" సంధ్య కిచెన్లో నుండి వస్తూ చెప్పింది నవ్వుతూ. "ఇతగాడి అల్లరే భరించలేక పోతున్నా. ఇహ ఆ పిల్లల.. అల్లరి.. బాబోయ్...! అయినా శ్యాం కనే పిల్లల్ని సరిదిద్దటానికే సమయం చాలటం లేదులే"

సంధ్య మాటలు అర్థంకాక ప్రశ్నార్థకంగా చూస్తే

## శ్రీశ్రీ

ఉయ్యాలలో రాజకీయాలు ఊగంగ
భీకర స్వప్నాల భీతిగొలిపె
కష్టజీవికి కాస్త గంజికావలెనంటు
పోరాడి చివరంట పోరు సలిపె
కమ్మరి, కుమ్మరి, కంచరి, కూలికి
చేయూత నిచ్చియు చేయి కలిపె
తాడిత, బాధిత, దళితుల కన్నీట
భావి చస్తున్నదని బదులు పలికె
చెమటోడ్చి పొలమున ఫలసాయమును దీయు
రైతు కూలీలతో కలిసిపాడె
కార్మిక సోదరుల కష్టాలు మరిపించ
కమ్మని పాటల కవితలల్లె
శ్రమ దోపిడిని చేయు చవట సన్నాసులకు
శ్రామికుని చరితాన్ని చాటిచెప్పె
నిజము తూరుపు నందు నింగిని జొచ్చెడు
సూర్యుడసలు గాదు చూసుకొనుము
జీవితమ్ము చివికి చిక్కని ముద్దగా
శ్రీశ్రీయె నిలిచెను చిత్రముగను

**-కొండ్ల రామచంద్రం**

శ్యాం జీవంలేని నవ్వు నవ్వాడు. "నే రాసే కవితలే బిడ్డలని.. తన భావం!"

"అంతే కదా వంశీ! మన రచనలు మానస సంతానమే కదా! ఒక్కోసారి.. ఒక్కో వాక్యానికి.. పదానికీ ఎంత ప్రసవ వేదన?" శ్యాం పక్కన కూర్చుంటూ అంది.

"అయినా.. పిల్లల్తో అనుభవించాల్సిన బాధలన్నీ.. శ్యాం చెల్లెళ్ళు, తమ్ముళ్ళతో పడ్డాం. ఇహ పిల్లల్తో సంతోషాలంటావా... నెలకోసారి అనాథాశ్రమానికి వెళ్తాం. ఒక రోజంతా అక్కడే ఉండి ఆ పిల్లల్తో ఆడుకొంటాం. ఆనందిస్తాం. మాకు చేతనైంది, మాకున్నంతలో వాళ్ళక్కొంచెం ఆర్థిక సాయం చేస్తాం. నేనేదో బాధపడ్తుంటానని తను బాధపడ్తాడు కానీ.. నిజానికి నాకే బాధా లేదు." శ్యాం దగ్గరగా జరిగి అతని చేతిని తన చేతిలోకి తీసుకొని సన్నగా నొక్కుతోంది. ఆ స్పర్శలో.. ఒకరి నుంచి మరొకర్లోకి ప్రవహించే ప్రేమ, అభిమానం, ఓదార్పులకు మాటలవసరం లేదు కదా!

"శ్యాంకు నేనే కూతురు. శ్యాం నాకు కొడుకు. అయినా... ఎంతమందిని కన్నా.. ఎన్ని బాధలు, కష్టాలు పడి సాకినా.. రెక్కలొచ్చేదాకానే కదా! చివరకు.. బతుకు సంధ్యలో మిగిలేది భార్యాభర్తలు ఒకరికొకరే కదా!" సంధ్య ఆర్తిగా అంది. "వంశీ! పొద్దున నువ్వు రెండుసార్లు ఓ ప్రశ్నడిగావు. జవాబు చెప్పటం కుదరనేలేదు."

సంధ్య మాటలకు కంగారుగా అడ్డొచ్చాను.. పశ్చాత్తాప పడవల్సిందెవరో ఇప్పుడు స్పష్టంగా అర్థమైంది కదా నాకు. అందుకే చెప్పాను. "అవసరం లేదు"

"అఫ్‌కోర్స్! ఈ అవకాశం వస్తుందని కూడా నేననుకోలేదు. కానీ చెప్పాలి. ఎందుకంటే.. ఈ ఇరవై ఏళ్ళల్లో.. ఒక్కసారి కూడా.. మనసులో కూడా నే నిన్ను తలుచుకోనేలేదు." సంధ్య మాటలు మనసు చురుక్కుమన్పిస్తున్నాయి. "కాకపోతే దీపం పెట్టి తల్చుకోవాల్సిన మనిషివి. ఎందుకంటే..." సంధ్య తన చేతిలోని శ్యాం చేతిని పెదవుల కానించుకొంది. "మంచితనం, మానవత్వం కలబోసిన ఈ ప్రేమైకమూర్తి... నా జీవన సహచరుడు కావటానికి ఆనాటి తిరస్కరణే కారణం కదా!"

చాచిపెట్టి లెంపకాయలు కొట్టినట్టు ఎడాపెడా తగుల్తున్న మాటల నొప్పికి మొహం ముడుచుకుపోతోంది. శ్యాం కంగారుగా, వారింపుగా చూశాడు.

"సంధ్యా! గత జల సేతు బంధనమెందుకు?"

"అవును. కూల్చేసిన అనురాగ సేతు శిథిల శకలాలు గత జలంలో కొట్టుకుపోయాయి. దాని గురించి బాధ లేదని చెప్పటానికే!" సంధ్య మాటలు స్థిరంగా, స్పష్టంగా. "ప్రేమించటం తప్పుకాదు. ప్రేమించిన వారిని వంచించటమే నేరం" సంధ్య అసహ్యం మొహాన ఉమ్మలా!

"ఆర్థిక స్వావలంబన లేకుండా..." గొణిగాను.

"చూడూ.. ప్రేమను.. ప్రేమించిన వారినీ బతికించుకోవచ్చని శ్యాం నిరూపించాడు కదా! ఆరోజు శ్యాం లేకపోతే.. బహుశా సంధ్య ఉండేది కాదేమో!"

బలవంతపు పెళ్ళి తప్పించుకోవటానికి ఇంట్లోంచి ఎంత ధైర్యంగా, ప్రేమించిన మనిషివన్న నమ్మకంతో వచ్చిందో.. ప్రేమికుడి అసమర్థతకు, అధైర్యానికి అంతగానూ కృంగిపోయింది. ఇంటికి తిరిగి వెళ్ళలేని నిస్సహాయ పరిస్థితిలో మిగులుతున్న సంధ్యను తాను పెళ్ళాడతానన్న శ్యాంను తను ఆశ్చర్యంగా చూస్తే.. సంధ్య అభిమానపడింది. నాకెవరి జాలి, సానుభూతి అవసరం లేదంటూ తిరస్కరించింది. అప్పుడు మనసు విప్పాడు శ్యాం. సంధ్యను దేవతగా తన గుండె గుడిలో మొదటి చూపులోనే నిలుపుకొన్నానని, అయితే ఆమె ఆవరకే ఇంకొకరిని ఇష్టపడ్తూండటం వల్ల తన ప్రేమను వ్యక్తపర్చలేదని.. తామిద్దరి మధ్యా ఉన్న స్నేహం ప్రేమగా మారేంతదాకా తాను వేచి ఉంటాననీ!

"మన ప్రేమలో స్వచ్ఛత, నిజాయితీ ఉంటే ఎప్పటికీ ఓడిపోదన్న గొప్ప నమ్మకం నాకు. ఆ నమ్మకమే సంధ్యను, ఆమె ప్రేమనూ నాకిచ్చి జీవితం ధన్యం చేసింది" శ్యాం ఆర్ద్రతగా, ఆత్మీయంగా సంధ్య వేపు చూస్తూ.. ఆమె భావోద్వేగాల ఊరడింపుగా భుజం చుట్టూ చేయి వేసి నెమ్మదిగా నిమురుతూ!

వేయి టన్నుల బరువు మోస్తున్నంత భారంగా తల.. మనసూ... భరించలేకపోతున్నాను. మహోన్నత శిఖరాల ముందు గులకరాయిలా ఫీలింగ్. ఇరవై ఏళ్ళ తర్వాత.. మళ్ళీ.. ఇలా.. వీళ్ళిద్దర్నీ చూస్తాననుకోలేదు. పనిమీద హైదరాబాద్ వెళ్తున్న తనను.. ఎవరికో సెండాఫ్ ఇవ్వటానికి స్టేషన్‌కొచ్చిన శ్యాం చూడ్డం.. బలవంతంగా దించి ఇంటికి తీసుకురావటం యాధృచ్ఛికమా? దురదృష్టమా? ఒక చక్కని జంటను చూసే అదృష్టమా? అదృష్టాన్ని కోల్పోయిన పరితాపమా?

"ఇక్కడ్నుంచి జస్ట్ టు అవర్స్ జర్నీ! వెహికల్ అరేంజ్ చేశాను. పనయ్యాక ఇటే రా వంశీ! రెండ్రోజులుండి వెళ్దువుగానీ!"

"లేదులే శ్యాం. ఇంకోసారొస్తాను."

"మీ శ్రీమతి, పిల్లల్తో సహా.. సకుటుంబ, సపరివారంగా రండి వంశీ!" సంధ్య పులుకడిగిన ముత్యమంత స్వచ్ఛంగా, ప్రశాంతంగా!

"సపరివారంగా ఓ.కే! కానీ.. శునకాలుంటే మాత్రం మినహాయించు మిత్రమా!" శ్యాం నవ్వాడు.

"ఓసారెప్పుడో.. మా కుక్క కాలు పట్టుకొందట. అప్పట్నుంచీ కుక్కలంటేనే మహా భయం ఈ ధీమంతుడికి" సంధ్య గలగలా నవ్వింది.

"ఆనాటి మన చెలిమి ఒక కల" సంధ్య మొహంలో పరిణతి చెందిన గంభీరం.

"ఒక పీడ కల! ఆ తర్వాత నుంచి సాగుతున్న మా జీవితం.. ఒక మధుర స్వప్నం! నాకింతటి అదృష్టాన్ని కల్గించిన నీకు ఋణపడి పోయాను వంశీ!" రెండు చేతులూ జోడించింది.

"నేను కూడా!" 'సెంటిమెంటల్ ఫూల్' అని నేను ఎప్పుడూ ఆట పట్టించే శ్యాంను సూటిగా చూళ్ళేకపోయాను.

"ప్రేమ నీ సెంటిమెంట్. ముగ్గురమూ స్నేహంగా ఉన్నాం. అంతే" అంటూ ఆ రోజు నేను తృణీకరించిన సంధ్యను తన జీవిత పరిమళం చేసుకొన్న శ్యాం, త్రికరణ శుద్ధిగా అతనికే అంకితమైన సంధ్య.. ఒకరికొరకు మరొకర్లా... 'మిథునం' కథలో 'మిథునం'లా.., ఆది దంపతుల్లా... గౌరవమో, క్షమార్పణో.. మనస్ఫూర్తిగా రెండు చేతులూ జోడించి.. కారెక్కాను. ఎడారి ప్రయాణంలో ఒయాసిస్సు మజిలీ.. తర్వాత మళ్ళీ ప్రయాణం!

"మీ శ్రీమతిని, పిల్లల్ని తప్పక తీసుకురా వంశీ!" ఇద్దరి మాటలూ గుర్తొచ్చి పెదవుల మీదకో శుష్కహాసం వచ్చి చేరింది.

నా పాప ఫలితమో, సంధ్య శాపమో.. ఒకానొక యాక్సిడెంట్‌లో 'మగ'తనమే దెబ్బతిని.. 'పెళ్ళ'నే ఆలోచనకే దూరమయ్యానని చెప్పలేని అదే అధైర్యం! అదే అసమర్థత!

మిగిలింది.. డిగ్రీ చదివిన ఆ మూడేళ్ళూ.. మా ముగ్గురి మధ్యా ఉన్న గాఢ స్నేహం, సంధ్య నాకు పంచిన ప్రేమ మాధుర్యాలే! అవును. ఆనాటి చెలిమి ఒక కల! సంధ్య విస్మృతించిన పీడకలే... నాకు తోడుగా మిగిలిన మధుర స్మృతి!! ■